క్లుప్తంగా

పీహెచ్‌సీలో వైద్యసేవలు బంద్

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పీహెచ్‌సీలో శనివారం పీజీ వైద్యవిద్యలో ఇన్‌సర్వీస్ కోటా కుదింపును వ్యతిరేకిస్తూ వైద్యులు చేపట్టిన ఆందోళనతో వైద్య సేవలు బంద్ అయ్యాయి. దీంతో రోగులు ఇబ్బంది పడ్డారు. వైద్యాధికారి దివాకర్ మాట్లాడుతూ ఇన్ సర్వీసు కోటాను కుదించడంతో పీజీ వైద్య విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం జీఓ 85ను రద్దు చేయాలని, లేకుంటే వైద్య సేవలు నిలిపివేస్తామని హెచ్చరించారు.

వసతులు మెరుగు పరచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి శ్రీకాంత్

సత్యవేడు: బాలుర గురుకుల పాఠశాలలో వసతులు మెరుగు పరచాలని రెడ్‌శ్యాండిల్ కోర్టు జడ్జి శ్రీకాంత్ అన్నారు. శనివారం జడ్జి సత్యవేడులోని బాలుర గురుకుల పాఠశాల, హాస్టల్‌ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా అని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థుల వసతులపై ఆరా తీశారు. వంట గది, భోజశాల, తరగతి గదులు, విద్యార్థుల విశ్రాంతి గదులను పరిశీలించారు. పలు చోట్ల ఫ్యాన్లు తిరగడంలేదని గుర్తించారు. ఫ్యాన్లు సక్రమంగా పనిచేసేట్లు చర్యలు తీసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శనివారం ఆపార్టీ ఆధ్వర్యంలో నేతలు, నివాళులర్పించారు. ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కరీముల్లా, రైతు సంఘం జిల్లా నాయకుడు రంగయ్య, రాంబాబు, గిరి, కునాల్ పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ: ద్విచక్ర వాహనచోదకులు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని, లేకుండా చర్యలు తప్పవని సీఐ తిమ్మయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ వద్ద శనివారం ఎస్ఐ విశ్వనాథనాయుడుతో కలసి వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్ పరిశీలించారు. సక్రమంగా రికార్డులు లేని వాహనలను సీజ్ చేశారు.

బోరుబావి, చేతిపంపు ఏర్పాటుకు విరాళం



చేతిపంపు వద్ద దాత ధనంజయులురెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: గాజులపెళ్లూరు శ్మశానంలో విశ్రాంత స్టేషన్‌మాస్టర్, దేవరపల్లి ధనంజయులురెడ్డి బోరు తవ్వించి, చేతిపంపును ఏర్పాటుకు రూ. 80 వేలు విరాళంగా ఇచ్చారు.

గంజాయి పట్టివేత

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలో స్కార్పియోలో తరలిస్తున్న గంజాయి ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. డ్రైవర్‌తో పాటు మరికొందరిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. నిందితులను విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

పేదలు చదువు కొనాల్సిందేనా?



మా మనమడు హర్షసాయి గతంలో నీట్ పరీక్ష రాశాడు. అయితే సీటు రాకపోవడంతో విజయవాడలో లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ప్రభుత్వం తీరు చూస్తే నాకు భయమేస్తోంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వ మెడికల్ కళాశాలలు నిర్మించారు. కూటమి ప్రభుత్వం వాటిని కావాలనే నిలుపుదల చేస్తోంది. ఎన్నికల్లో మాత్రం తాము అధికారంలోకి వస్తే అన్నీ ఉచిత వైద్య సీట్లను ఇచ్చేస్తామని ప్రకటించింది. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ప్రైవేటు వైద్య కళాశాలలకు ప్రాధాన్యమిచ్చే కూటమి ప్రభుత్వ హయాంలో పేదోడు తన పిల్లల్ని వైద్యవిద్యను చదివించడం కష్టమే. – శంకరయ్య, బీఎన్‌కండ్రిగ



నా ఆశలు అడియాశలేనా?



గత ప్రభుత్వంలో మెడికల్ కళాశాలలు వస్తున్నాయని.. పేద కుటుంబానికి చెందిన నాకు నీట్‌లో మంచి ర్యాంకు సాధించి డాక్టర్ కావాలనే కలను నెరవేర్చుకోవాలనుకున్నాను. నూతన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నా ఆశలు అడియాలశయ్యేటట్లు ఉన్నాయి. ఎక్కువ మెడికల్ కళాశాలలు వస్తే మాలాంటి పేదవారికి అవకాశం వస్తుంది. తండ్రి చనిపోయాడు. తల్లి కూలీనాలీ చేసుకుని చదివిస్తోంది. రాయలసీమ కళాశాలలో కరస్పాండెంట్ సుబ్బరామిరెడ్డి సహాయంతో చదువుకుంటున్నాను. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నా ఆశలు అడియాశలు అవుతాయోనని ఆవేదన కలుగుతోంది. ప్రభుత్వం పునరాలోచించాలి. – జి.పద్మశ్రీ, బైపీసీ విద్యార్థిని, సీనియర్ ఇంటర్

ప్రతిభకు ప్రోత్సాహం..

భవితకు ఉపకారం



విద్యతో ఉజ్వల భవిత సాకారం.. చదవాలన్న తపన ఉన్నా, కుటుంబ పరిస్థితులు, ఆర్థిక స్తోమత అనుకూలించక సరస్వతీ కటాక్షం అందని వైనం.. పలువురు పేదలు సంకల్పానికి దూరం.. ఈ స్థితిని గుర్తించిన కేంద్రం ప్రతిభ గల పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతతో విద్యాప్రగతి బాటలు వేస్తోంది. విజ్ఞానమే కొలమానంగా ఉపకార వేతనాలు మంజూరు చేస్తూ వారు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి సోపానం వేస్తోంది.

- అందుబాటులో జాతీయ పథకం
- జాతీయ ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- వినియోగించుకుంటే బాలల బంగారు భవితకు బాట

వరదయ్యపాళెం: తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి, భవిష్యత్తులో స్థిరపడాలని తల్లిదండ్రులు కలలు కంటారు. పేదరికం కారణంగా వారి ఆశలు అడియాసలవుతున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి చదివించే స్తోమత చాలా మందికి లేకపోవడంతో చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. ఆ తరువాత కూలీ పనులకు పంపుతున్న సందర్భాలు కోకొల్లలు. ఈ దుస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. 2008లో పేద పిల్లల కోసం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం ద్వారా ఎనిమిదో తరగతి చదివే పిల్లలకు ఏటా పరీక్ష నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచేవారికి నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తుంది.

వీరు అర్హులు

ప్రభుత్వ జిల్లా పరిషత్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష రాయడానికి అర్హులు. వీరు ఆరు, ఏడు తరగతుల్లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలు మించకూడదు. పాఠశాలలో రెగ్యులర్ విధానంలో విద్యార్థులు చదువుతుండాలి.



పరీక్షలకు సిద్ధమవుతున్న 8వ తరగతి విద్యార్థులు

పరీక్ష విధానం

పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 3 గంట వ్యవధిలో 180 ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. పరీక్షలో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేస్తారు.

ఏడాదికి రూ.12 వేల ఉపకార వేతనం



కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నెలకు రూ. వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేలు ఆర్థికసాయం అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ల పాటు ఈ స్కాలర్‌షిప్ అందుతుంది. నగదును ఏడాదికి విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. చదువుకోవాలనే పట్టుదల ఉండి పేదరికం, ఆర్థికపరమైన ఇబ్బందులు ద్వారా విద్యకు దూరమైన విద్యార్థులకు ఈ సాయం ఎంతగానో దోహదపడుతుంది.

దరఖాస్తుల ఆహ్వానం



నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఆ దిశగా దరఖాస్తుల ప్రక్రియ గత ఆగస్టు 5వ తేదీన ప్రారంభం కాగా ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తుకు చివరి తేదీని పొడిగించినట్లు అధికారులు ప్రకటించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకుని రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

ఫీజు వివరాలివీ



దరఖాస్తు చేసుకోవడానికి ఓసీ, బీసీ విద్యార్థులైతే పరీక్షల రుసుము రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే పరీక్ష రుసుం రూ.50 చెల్లించాల్సి ఉంది. పరీక్షా రుసుం ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంది. దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్ www. bre.ap.gov.in నందు నమోదు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగా గానే విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేర్లను నమోదు చేయాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో ఈ నెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు ఉపకార వేతనం పొందడానికి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకం మంచి అవకాశం. ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షల్లో ప్రతిభ చాటితే నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తారు. చదువుకు ఆటంకం కలిగించే ఆర్థికపరమైన ఇబ్బందులు అధిగమించడానికి ఈ ఉపకార వేతనం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ అవకాశాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – సరస్వతి, ఎంఈఓ, వరదయ్యపాళెం మండలం

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఉత్సవర్లు మాడవీధి తిరుచ్చిపై ఊరేగారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలు పూర్తి చేశారు. ఏకాదశి గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంలో కొలువుదీర్చి, మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయాధికారి నాగరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సకాలంలో రుణాలు చెల్లించండి



మాట్లాడుతున్న ఏపీఎం ఇందిరమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని యానాది సమాఖ్య సభ్యులు సకాలంలో రుణాలను చెల్లించి, పరపతిని పెంచుకోవాలని ఐకేపీ ఏపీఎం ఇందిరమ్మ తెలిపారు. శనివారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండల యానాది సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బ్యాంకు, స్త్రీనిధి, పొదుపు రుణాలను తీసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. సభ్యులందరూ తప్పనిసరిగా రుణ బకాయిలను చెల్లించాలని తెలిపారు. రుణాలను వ్యాపారాలకు ఉపయోగించి, తద్వారా వచ్చిన ఆదాయంతో రుణాలను చెల్లించేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.

మట్టి తరలిస్తే కేసులు

సత్యవేడు: చెరువులు, తెలుగంగ కాలువల మట్టి తరలింపునకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలని, అనుమతులు లేకుండా ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామమి ఎస్ఐ రామస్వామి అన్నారు. ప్రధానంగా గంగ కాలువ మట్టి తరలిపోకుండా చట్టపరంగా చర్యలు తీసుకొంటామన్నారు. అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. చెరువు మట్టి తరలింపునకు రెవెన్యూ , ఇరిగేషన్ అధికారుల అనుమతులు ఉండాలన్నారు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధుల కట్టడి

రేణిగుంట: చిన్నపాటి జాగ్రత్తలను పాటించి, పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులను కట్టడి చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రవంతి అన్నారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీ అన్నాసామిపల్లెలో శనివారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎం.సుశీల ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రైతులు తీసుకొచ్చిన పశువులు, దూడలు, జీవాలకు ఈ సీజన్‌లో ఎటువంటి సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి.. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు ఇచ్చారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పశువుల్లో పిడుదుల నివారణకు మందును పిచికారీ చేయించారు. రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, సిబ్బంది గిరిప్రసాద్, అన్బలగన్, ఇందుమతి, నాగమణి, స్వాతి, శంకరయ్య, గోపాల మిత్ర మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డితో పార్టీ నేతల భేటీ





పెద్దిరెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ దివాకర్‌రెడ్డి , ఎంపీ మిథున్‌రెడ్డిని సన్మానిస్తున్న రాజేష్, మండల నాయకులు

నారాయణవనం: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ నారాయణవనం మండల నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం సాయంత్రం తిరుపతిలో ఆయన నివాసంలో కలిశారు. వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా, పార్టీ రాజకీయ సలహా కమిటీ సభ్యునిగా నియమితులైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జన్మదినం జరుపుకున్న మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువలు కప్పి, సత్కరించారు. మీ వెంటే నడుస్తూ, సత్యవేడు నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు పాటుపడుతామని ఈ సందర్భంగా పార్టీ నాయకులు పెద్దిరెడ్డితో పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకూ అండగా నిలుస్తామని ఈ సందర్భంగా పెద్దిరెడ్డి వారి హామీ ఇచ్చారు. సత్యవేడు పార్టీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్‌తో పాటు పార్టీ నాయకులు బీరేంద్ర, అన్నాదొరై, కిరణ్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, రవి, తిరువేంగండం, హేమచంద్రారెడ్డి, అశోక్, మహేష్, గోవిందస్వామి తదితరులు పెద్దిరెడ్డిని, మిథున్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

అదాలత్ తీర్పు సుప్రీం తీర్పుతో సమానం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: జాతీయ లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని శ్రీకాళహస్తి న్యాయస్థానం జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పుపై అపీల్‌కు అవకాశం లేదని తెలిపారు. ఇందులో అన్ని రకాల కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమని చెప్పారు. అనంతరం లోక్ అదాలత్‌ను నిర్వహించి పలు రకాల కేసును పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు బేబీరాణి, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 287 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి శ్రీకాంత్

సత్యవేడు: కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 247 కేసులు పరిష్కరించి రూ. 51,35,954 రికవరీ చేసినట్లు తి రుపతి రెడ్‌శ్యాండిల్ కోర్టు జడ్జి శ్రీకాంత్ తెలిపారు. చెక్ బౌన్స్ కేసులు 8, డెమెస్టిక్ వైయిలెన్స్ 1, అడ్మిషన్ కేసులు(ఫైన్) 16, ఐపీసీ కేసులు 15, క్రిమిల్ కేసులు 41, సివిల్ 8, పెట్టీ కేసులు 198 పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, బ్యాంకు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ రోడ్డుపై గుంతలు పూడ్చివేత

వరదయ్యపాళెం: ఇటీవల కురిసిన వర్షాలకు చిన్నపాండూరు ఆర్ అండ్ బీ రోడ్డులో కదూరు కూడలిలో ఏర్పడిన గుంతలను సత్యవేడు సీఐ మురళీ ఆదేశాలతో వరదయ్యపాళెం ఎస్ఐ మల్లికార్జున చొరవతో పూడ్చి వేశారు. అంజనేయస్వామి విగ్రహ కూడలి నుంచి రాచర్ల, యానాదివెట్టు, కంచరపాళెం వద్ద పలుచోట్ల గుంతలను జేసీబీతో పూడ్చి వేశారు.

గుడిమల్లంలో అన్నదానం



ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం భక్తులకు అన్నదానం చేశారు. పరశురామేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గిరినాయుడు, ఈఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వినాయక విగ్రహానికి పూజలు చేసి, భక్తులకు అన్నదానం చేశారు.

నూతన కార్యవర్గం



శ్రీకాళహస్తి: పట్టణంలోని బంగారమ్మ కాలనీ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవా సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా నూతలపాటి వనమాలి నాయుడు, ఉపాధ్యక్షుడిగా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా మాధవయ్య, కార్యనిర్వాహక సభ్యులుగా భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, గోవిందస్వామిరెడ్డి, సోమశేఖర్‌నాయుడు, లీలామోహన్ తదితరులు ఎన్నికయ్యారు.

మందుబాబులకు జరిమానా

శ్రీకాళహస్తి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 12 మందికి జరిమానా విధించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.. శ్రీకాళహస్తి ఒకటో పట్టణ సీఐ గోపీ ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 12 మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. తాగి వాహనం నడిపిన ఒకరికి రూ.10 వేలు, అలాగే న్యూసెన్స్ కేసులో 25 మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

కట్ట పుట్టాలమ్మ శిల్పాలను కాపాడుకోవాలి

– పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



విగ్రహాలను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడిలో ఉన్న చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కట్ట పుట్టాలమ్మ దేవాలయం ముందున్న మధ్యయుగ శిల్పాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ ఈమని శివనాగిరెడ్డి కోరారు. ఎస్వీ భక్తి ఛానల్ సీనియర్ ప్రొడ్యూసర్ బీవీ రమణ ఇచ్చిన సమాచారం మేరకు ఆయన శనివారం ఆలయాన్ని సందర్శించి, ఆలయ ప్రాంగణంలో ఉన్న శిల్పాలను పరిశీలించారు. ఆలయ మండపంలో కుడివైపున వీరభద్ర, అమ్మవారు, గణేశ శిల్పాలు, ఎడమవైపున ఆత్మార్పణ వీరుడు, ద్వారపాలకుడి శిల్పాలు భూమిలో కూరుకుపోయి ఉన్నట్లు గుర్తించారు. ద్వారపాలకుడి శిల్పాలు పసుపు రంగుతో నిండిపోయి ప్రాచీనతను కూలిపోతున్నాయని, ఆ విగ్రహాలను పైకి లేపి, రంగులు తొలగించి, పీఠాలపై నిలబెట్టాల్సిన అవసరముందని ఆలయ నిర్వాహకులకు ఆయన విజ్ఞప్తి చేశారు. విజయనగర సామ్రాజ్యం అనంతర కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు కరకంబాడి–మామండూరు –కృష్ణాపురం పాలెగాళ్ల నాయిని వంశీయులు కడప, నెల్లూరు, చెన్నపట్నం నుంచి తిరుపతికి వచ్చే భక్తులను అడవి జంతువులు, దొంగల బారి నుంచి కాపాడే బాధ్యతలు నిర్వర్తించేవారన్నారు. ఆ పాలెగాళ్లే, పుట్టాలమ్మ ఆలయాన్ని నిర్మించేవారని, ఈ శిల్పాలు కూడా అప్పటి నుంచి పూజాలందుకుంటున్నాయని బీవీ రమణ చెప్పారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగి, పురావస్తు ప్రాధాన్యత గల ఈ శిల్పాలను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాలని ఆలయాధికారులు, గ్రామస్తులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ శిల్పి పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.